
ప్రజాశక్తి
శనివారం 3 మే 2025
5
విజయనగరం




రుణాలకు మైనార్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లాలో నివసిస్తున్న ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీక తదితర మైనారిటీ వర్గాల వారికి బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకోసం రాష్ట్ర మైనారిటీ ఆర్థిక సహకార సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయా వర్గాలకు చెందిన అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనే వారి వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వుండాలని, అభ్యర్థుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తును https://apob-mms.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తు ప్రతిని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలను తమ వెంట తీసుకురావాలని కోరారు. ఇతర సమాచారం కోసం మైనారిటీ కార్పొరేషన్ కార్యాలయాన్ని 08922-230250 ఫోన్ నెంబరులో, 9849901160, 7995087037 మొబైల్ నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

నోటిఫికేషన్‌కే పరిమితం

- ముందుకు కదలని విమానాశ్రయ అనుసంధాన రహదారుల పనులు
- రెండు రోడ్లకు 106 ఎకరాల భూ సేకరణ
- సుమారు రూ.60 కోట్లు అవసరమని అంచనా
- నిధులు లేక ముందుకు సాగని భూసేకరణ పక్రియ



దాకమర్రి జంక్షన్ నుంచి సవరవల్లి వరకు నిర్మించనున్న రహదారి మ్యాప్



ఎ.రావివలస వద్ద నిర్మిస్తున్న కూడలి వంతెన

భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేందుకు అవసరమైన రెండు రహదారులకు విఎమ్ఆర్‌డిఎ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికి పరిహారం ఇచ్చేందుకు నిధులు లేక ముందుకు సాగడం లేదు. ఇప్పటికే నియోజకవర్గంలో ఈ రెండు రహదారులకు నోటిఫికేషన్‌ను రెండు మూడు నెలలు కిందట విడుదల చేసిన విషయం తెలిసిందే. కానీ నిధులు లేకపోవడంతో ఇప్పటి వరకు నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత జరగాల్సిన పక్రియ ముందుకు సాగలేదు. రెండు రహదారులకు కలిపి 106 ఎకరాలు భూమిని సేకరించాల్సి ఉంది. కానీ ఇంకా రైతులకు ఎకరాకు ఎంత పరిహారం ఇస్తామనేది కూడా తేల్చలేదు.

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 జూన్ నాటికి పూర్తి చేయాలనే నిర్ణయంతో ప్రభుత్వం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకు తగ్గట్టుగా విమానాశ్రయానికి చేరుకునేందుకు అవసరమైన రహదారులపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా మొత్తం విశాఖ, విజయనగరం జిల్లాల్లో 15 రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతలను ప్రభుత్వం విఎమ్ఆర్‌డిఎకు అప్పజెప్పింది. దీంతో నియోజకవర్గంలో రెండు రహదారుల నిర్మాణానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఒకటి అవంతి కళాశాల సమీపంలోని గుడివాడ రహదారి నుంచి పోలిపల్లి ఏటి పొలాలు, రావాడ మీదుగా విమానాశ్రయానికి వెళ్లేందుకు నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్డును ఎ.రావివలస సమీపంలో అనుసంధానం చేయనున్నారు. విజయనగరం నుంచి విశాఖ వెళ్ళే రహదారిలో రఘు కళాశాల సమీపంలో దాకమర్రి జంక్షన్ నుంచి మోపాడ, గంట్లాం మీదుగా సవరవల్లి సమీపంలో జాతీయరహదారికి ఒక రోడ్డును నిర్మించాలని అనుకున్నారు. ఈ రెండు రహదారులకు నోటిఫికేషన్ కూడా జారీ చేశారు.

నిధుల కొరతతో ముందుకు సాగని భూసేకరణ పక్రియ

ఈ రహదారుల కోసం నోటిఫికేషన్ జారీ చేసి సుమారు రెండు మూడు నెలలు గడుస్తోంది. ఇంత వరకు భూసేకరణకు చేయాల్సిన పక్రియ ముందుకు సాగలేదు. విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా వివిధ అవసరాలకు సేకరిస్తున్న భూమికి ప్రస్తుతం ఎకరాకు రూ.57లక్షలు పరిహారం నిర్ణయించి ఇస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని అయితే సుమారు 60లక్షలు వరకు ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ఈ రెండు రహదారులకు సుమారు 106 ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ఇందులో గుడివాడ రహదారికి 60 ఎకరాలు, దాకమర్రి నుంచి సవరవల్లి రహదారికి సుమారు 46 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించారు. అంటే సుమారు ఎలా చూసుకున్న రూ.60కోట్లకు పైగానే భూసేకరణకు నిధులు ఉండాలి. ఇంకా రహదారులు నిర్మాణానికి కూడా నిధులు అవసరం ఉంటుంది. ఇలా చూసుకుంటే ప్రస్తుతం విఎమ్ఆర్‌డిఎ ఖజానాలో అంత మొత్తంలో నిధులు లేవని తెలిసింది. ఇవన్నీ నిర్మాణాలు కావాలంటే ముందు నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం విఎమ్ఆర్‌డిఎ ఈ నిధుల అన్వేషణలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

'తారకరామ' పనులు అడ్డగింత

- భూ సమస్య పరిష్కరించాకే పనులు చేపట్టాలన్న కోరాడపేట రైతులు
- దౌర్జన్యం చేసిన అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పనులు అడ్డుకుంటున్న రైతులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో దన్నానపేట పంచాయతీ పరిధిలోని కోరాడపేటలో తారక రామ తీర్థ సాగర్ ప్రాజెక్టు పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. తమ భూసమస్య పరిష్కరించే పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం దౌర్జన్యంగా వ్యవహరించిన అధికారులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతుల కథనం ప్రకారం...

కోరాడపేట రెవెన్యూ పరిధిలో తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు అధికారులు యంత్రాలతో చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. తమ భూముల సమస్య పరిష్కరించాకే పనులు చేపట్టాలని రైతులు యంత్రాలను అడ్డుకున్నారు. అయినా వినకుండా అధికారులు.. పనులు చేయాలని డ్రైవర్లపై ఒత్తిడి చేశారు. దీంతో చేసేదేమీలేక రైతులు వాహనాలకు అడ్డంగా బైఠాయించారు. కోరాడపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 45 నుంచి 54 వరకు ఉన్న భూములు ప్రాజెక్టు పేరిట తప్పుగా నమోదైనట్లు రైతులు చెప్పారు. ఇదే భూమిపై జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ గ్రీవెన్స్‌లో సరిచేయాలని ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. అప్పట్లో ఆర్‌డిఒ కూడా భూములు పరిశీలించి, రైతులకు న్యాయం చేశాకే ప్రాజెక్టు పనులు చేయాలని చెప్పారని వివరించారు. అవేవీ పట్టించుకోకుండా, గ్రామపెద్దలకు, రైతులకు చెప్పా పెట్టకుండా హుటాహుటిన పనులు ప్రారంభించాలని చూడటం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించారని రైతులు కోరాడ శ్రీదేవి, కె.లక్ష్మి, కోరాడ అప్పలనాయుడు, కె.రామునాయుడు, రామారావు, బి.సత్యనారాయణ, టి. గోవింద ఫిర్యాదుచేశారు. ప్రాజెక్టు డిఇ ఎప్పటికప్పుడు ఇలాగే పనులకు అడ్డుతగులుతున్నారని మహిళలపై అసభ్య పదజాలం ప్రయోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దౌర్జన్యం చేసిన డిఇ, జెఇ, జెసిబి డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. పనులు అడ్డుకుని, తమపై దాడి చేసినట్లు అధికారులు.. రైతులపై ఫిర్యాదుచేశారు.

శ్రమ నుంచి పుట్టినవే కళారూపాలు

గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రమలో నుంచి పుట్టినవే కలలు, కళా రూపాలు, పాటలు అంటూ పలువురు వక్తలు కళారంగం ప్రాధాన్యతను వివరించారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ముందుగా నారాయణమూర్తి మాస్టారు సాంప్రదాయ బద్ధమైన సాహిత్యంతో కూడిన నేను సైతం ప్రపంచాగ్నికి ఆహుతిచ్చాను అనే పాటను పాడి అలరించారు. అనంతరం భరత నాట్యం మూషిక వాహన అనే గీతానికి చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి సింహాచలం కూటికోసం అనే గీతాన్ని పాడి అందరితోను చప్పట్లు కొట్టించారు. శ్రమ విలువను తెలియజేస్తూ కూటి కోసం పడిన కష్టాన్ని పాట ద్వారా వినిపించారు. తర్వాత రాజా శ్యామల ట్రూప్ కోలాటం, గాజులరేగ జెడ్‌పి హైస్కూలు విద్యార్థుల ప్రదర్శించన కట్టుకున్నాయి. అనంతరం సీనియర్ కళాకారులు సర్వేశ్వరరావు మాట్లాడుతూ మహనీయుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వారి పోరాట ఫలాలే నేడు మనం అనుభవిస్తున్న హక్కులు అని తెలిపారు. అనంతరం కారులో షికారుకెళ్లే పసిడి దాన అనే పాట ద్వారా శ్రమ జీవుల విలువను తెలియజేస్తూ పాడి పాట అలరించారు. సీనియర్ సినీ కళాకారులు, 20 సినిమాల్లో నటించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు దాశరథి తిరుపతి నాయుడు శుక్లాం భరదరామ్, విష్ణుం, శశి వర్ణం అనే పద్యాన్ని పాడి అలరించారు. డప్పు శ్రీను వానరం నుంచి మనిషిగా ఎదిగిన విషయం చెబుతూ శ్రమ నుంచి పుట్టింది పాట అంటూ పాడిన పాట శ్రోతలను ఆకట్టుకుంది. అనంతరం గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రమను మర్చిపోవడం కోసం నాడు వినిపించే గొంతే పాటగా మారిందని, జంతువులను ఆకట్టుకునేందుకు కొన్ని రకాల శబ్దాలు,వేటకు వెళ్లేటప్పుడు ఒక రకమైన అరుపులు చేసేవారని తెలిపారు. ఒక సామాజిక మార్పులో భాగంగా కళా రూపాలు పుట్టుకొచ్చాయన్నారు. కానీ నేడు ఆ కళారూపాలు పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోయా యన్నారు.కళలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని అన్నారు. అనంతరం అభినయప్రియ డ్యాన్సర్, యాక్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన ఎం.సాయి సుప్రియ ఆధ్వర్యంలో సోలో, గ్రూప్ , పాప్, శివతాండవం వంటి డాన్సులు ప్రదర్శించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సభ్యులు ఏలూరు శ్రీనివాసరావు, సిహెచ్‌విఆర్ఎస్ రాజు, గీతా స్రవంతి, లతామంగేష్, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారిణులు

బెట్టింగ్‌కు పాల్పడుతున్న 11మంది అరెస్టు

రూ.14.02 లక్షల నగదు, కారు, ల్యాప్ టాప్, 13మొబైల్స్ సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం, బొబ్బిలి

బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని శివరాంపురం గ్రామ శివార్లలోని మామిడి తోటలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ప్రధాన నిందితులతో సహా 11మందిని అరెస్టు చేసినట్లుగా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

శివరాంపురం గ్రామ శివార్లలోగల మామిడితోటలో ఐపిఎల్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముసిడిపల్లి దివాకర్ బెట్టింగులతో నగదు సంపాదించాలనే లక్ష్యంతో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతూ, బెంగుళూరుకు చెందిన నిరంజన్ రెడ్డి నుంచి 'రాధే ఎక్చేంజ్' అనే బెట్టింగు యాప్ అడ్మిన్ తీసుకొని, యువతను ఆకర్షించేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో కమీషను ఇస్తూ ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క ఏజంటును నియమించుకున్నారు. ఏజంట్లుగా నియమించినబడిన వ్యక్తులంతా బెట్టింగు యాప్‌ను ప్రమోట్ చేస్తూ, యువతను ఆకర్షిస్తూ, వాట్సాప్ ద్వారా లింకులను షేర్ చేస్తూ, ఒక పథకం ప్రకారం బెట్టింగులకు పాల్పడుతున్నారు. బెట్టింగులకు మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో ముసిడిపల్లి దివాకర్, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గుండాల నవీన్, ఈదుబిల్లి సంతోష్ లతో కలసి నేషనల్ ఎక్చేంజ్ అనే మరో బెట్టింగు యాప్ అడ్మిన్ ఐడిని తీసుకున్నారు. ఈ యాప్‌లను సుమారు 200మంది యువకులు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో వినియోగిస్తూ, బెట్టింగులకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈనేపథ్యంలో దాడి చేసి 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముషిడిపల్లి దివాకర్ (అడ్మిన్), అంబటి రాంమోహన్ (అడ్మిన్), మహంతి గణేష్ (ఏజంట్), సామిరెడ్డి వాసు (ఏజంట్) కొట్టంగి మోహనరావు (ఏజంట్), మోడడ్ల పైడిరాజు (ఏజంట్), తాటి శంకరరావు (ఏజంట్), గేదెల శ్రీనివాస్ (యూజర్), సీరపు నారాయణరావు (యూజర్), తెర్లి మోహనరావు (యూజర్) ఉన్నారు. వీరి నుంచి రూ.14.02లక్షల నగదు, లెనోవ ల్యాప్ టాప్, ఒక కారు, 13 మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిరంజన్ రెడ్డి (అడ్మిన్), ఈదురపల్లి సంతోష్ (అడ్మిన్), కార్తీక్ (అడ్మిన్), నవీన్ (అడ్మిన్) కోసం గాలిస్తున్నారు. ప్రధాన నిందితుడు అయిన ముసిడిపల్లి దివాకర్ ఏజంట్లుకు 3శాతం కమీషను ఇవ్వడంతోపాటు, పోగొట్టుకున్న వ్యక్తుల నగదులో 50శాతం సొమ్మును ఏజంట్లుకు ఇచ్చి.వారిని బెట్టింగు యాప్ ప్రమోట్ చేసేందుకు ప్రోత్సహించేవాడని ఎస్‌పి తెలిపారు. ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లతో డబ్బులు సంపాదించడం సాధ్యం కాదని, యాప్ నిర్వాహకులు డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతోనే యాప్‌లను తయారు చేసి, యువతను ఆకర్షిస్తారని తెలిపారు.

క్రికెట్ బెట్టింగు ముఠాను గుట్టురట్టు చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, బొబ్బిలి సిఐ కే.సతీష్ కుమార్, బొబ్బిలి ఎస్ఐ ఆర్.రమేష్, కానిస్టేబుళ్ళు ఎన్.సత్యనారాయణ, పి.సతీష్ కుమార్, కె.ఎర్రం నాయుడు, పి.అప్పారావులను ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉద్యాన రైతులకు రాయితీ పెంపు

ప్రజాశక్తి-విజయనగరం

ఉద్యాన రైతులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రైతులకు ఇస్తున్న రాయితీలను భారీగా పెంచినట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 45400 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగులో ఉన్నాయని, వీటిని విస్తరించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా మామిడి, కొబ్బరి, జీడిమామిడి, ఆయిల్ పామ్, అరటి, కూరగాయ పంటల సాగు జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం ఎంతోప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో ఈ ఏడాది 25 లక్షల హెక్టార్లలో వివిధ పథకముల ద్వారా ఉద్యాన పంటలు విస్తరించాలని లక్ష్యం నిర్దేశించిందని తెలిపారు. ఇదే క్రమంలో జిల్లాలో ఉద్యాన పంటల విస్తరణలో భాగంగా ఈ 2025-26 సంవత్సరానికి ఆర్‌కెవివై పథకం కింద 128 హెక్టార్లు, ఎన్ఎంఇఒ (ఆయిల్‌పాం) పథకం కింద 1600 హెక్టార్లు, ఎంఐడిహెచ్ పథకం కింద 150 హెక్టార్లు. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 1000 హెక్టార్లు, పంటల వైవిధ్యం కింద 100 హెక్టార్లు మన జిల్లాకు నిర్దేశించిందని పేర్కొన్నారు. వివిధ ఉద్యాన పంట విస్తరణలకు గాను ప్రభుత్వం ఈ సంవత్సరం రాయితీని పెంచిందని తెలిపారు. ఈ పథకాలపట్ల ఆసక్తి ఉన్న ఉద్యాన రైతులు, సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బంది, ఉద్యాన అధికారులను సంప్రదించి పంటసాగు వివరాలను తెలుసుకొని ప్రభుత్వం వారు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సచివాలయంలో కిశోర వికాసం శిబిరాలు

విజయనగరం టౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయ పరిధిలో కిశోర వికాసం వేసవి ప్రత్యేక శిబిరాలు ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు ఈ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం ఐసిడిఎస్, మెప్మా, సచివాలయ సిబ్బంది సమన్వయంతో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల పరిచయం అనంతరం కిషోర బాలికలు వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. బాలికల సంరక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను వివరించారు.

సర్టిఫికెట్ల మంజూరులో జాప్యాన్ని నివారించాలి

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపాధ్యాయుల మెడికల్ చెకప్, సర్టిఫికెట్‌ల మంజూరు విషయంలో జాప్యాన్ని నివారించాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా కేంద్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. అప్పలనాయుడును కోరారు. ముఖ్యంగా ఇఎన్‌టికి సంబంధించి ఉపాధ్యాయుల చెకప్ ఇంతవరకు పూర్తి కాలేదని, కాబట్టి వాటిని త్వరగతిన పూర్తి చేసి, సర్టిఫికేట్ మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే చెకప్ పూర్తయిన ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్స్ జిల్లా విద్యాశాఖ ద్వారా ఎంఇఒలకు పంపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, ఎస్‌టియు జిల్లా నాయకులు శ్రీనివాస దొర, ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ వినతులపై విచారణ

అధికారులకు కలెక్టర్ ఆదేశం • కలెక్టరేట్ చుట్టూ సిసి కెమెరాలు ఏర్పాటు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుండి వచ్చిన వినతులపై కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం తన ఛాంబర్ లో విచారణ జరిపించారు. అర్జీదారులను, అధికారులను పిలిపించి దరఖాస్తుల పై ముఖాముఖి విచారణ జరిపారు. డెంకాడ మండలం పెదతాడివాడకు చెందిన పొంతపల్లిలక్ష్మి తన భూమిని ఆక్రమించారు అనే అంశం పై ఉప ముఖ్యమంత్రి కి దరఖాస్తు చేసుకున్నారు. విచారణ జరపగా తనే ఆ భూమిని అమ్మివేసినట్లుగా రికార్డులు ఉన్నట్లు గుర్తించారు. ఇదే అంశంపై ఆమె ఇప్పటి వరకు 11 సార్లు పిజిఆర్ఎస్ లో దరఖాస్తు చేసినట్లు గుర్తించారు. ప్రతి సారి దరఖాస్తు రాయడానికి 500 రూపాయలు చెల్లిస్తున్నట్లు ఆమె కలెక్టర్‌కు తెలిపారు. ఆమె వెనుక ఒక లాయర్ ఉండి రాయిస్తున్నారని కూడా వివరించారు. కలెక్టర్ సందిస్తూ దీనిపై సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రికి పంపించాలని డెంకాడ తహశీల్దార్‌కు సూచించారు. నిరక్షరాస్యులను ప్రలోభ పరచి డబ్బులు వసూలు చేసే వారిని నియంత్రించడానికి కలెక్టరేట్ చుట్టూ లోపల, బయట సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని ఎఒ రూమ్ వద్ద పర్యవేక్షించేలా కనెక్షన్ ఇవ్వాలని, అనుమానం ఉండే పట్ల దృష్టి పెట్టాలని పోలీస్ శాఖ వారికి కూడా లేఖ రాయాలని డిఆర్‌ఒకు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజావాణి లో వంగర మండలం మడ్డువలస గ్రామానికి చెందిన పడాల సన్యాసి రావు తన 7ఎకరాల భూమిని రీ సర్వే లో వేరొకరి పేరు మీద రాసేశారని , న్యాయం చేయాలని వేడుకుంటూ అర్జీని సమర్పించారు. దీనిపై విచారణ జరిపి రెండు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర రావుకు, సర్వే ఎడి రమణమూర్తిని కలెక్టర్ ఆదేశించారు. కొత్తవలస మండలం గులివిందాడ గ్రామానికి చెందిన డి.టి.నాయుడు తదితరులు జాయింట్ కలెక్టర్ రైత్వారీ పట్టా ఇచ్చిన ఉడా లే అవుట్ ను ప్రభుత్వ జాబితాలో చేర్చారని, ఆ జాబితా నుండి తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసారు. దీని పై కూడా రికార్డులను వెరిఫై చేసి సరిదిద్దాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. ఈ విచారణలో డిప్యూటీ కలెక్టర్లు మురళీ, వెంకటేశ్వర రావు, డిపిఒ వెంకటేశ్వరరావు, సర్వేశాఖ ఎడి రమణ మూర్తి, సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు.

సిరిమాను తిరిగే రోడ్లపై గోతులు పూడ్చాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి గ్రామదేవత దాడితల్లి పండగ సందర్భంగా సిరిమాను తిరిగే ప్రాంతాల్లో రోడ్లపై గోతులను పూడ్చాలని ఎమ్మెల్యే బేబినాయన.. మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక కోటలో శుక్రవారం మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. సిరిమాను తిరిగే ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, కరెంటు తీగలు, అడ్డంగా పెరిగిన చెట్లకొమ్మలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన ఆలయం వద్ద ఉన్న కాలువ సమస్య తన దృష్టికి వచ్చిందని, గుడికి వచ్చే యాత్రికులకు ఇబ్బంది కలుగకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని ఆదేశించారు.

పేదల గుడిసెల తొలగింపు ఆపాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కిల్తంపాలెం పంచాయతీ రాజుల కళ్లాలు వద్ద పేదల గుడిసెల తొలగింపు ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన పేదలు శుక్రవారం స్థానిక తహశీల్దార్ అరుణ కుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మద్దిల రమణ మాట్లాడుతూ రాజుల కళ్లాలు సమీప గెడ్డను ఆనుకుని 40 ఏళ్లుగా 15 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. పాకలు వేసుకుని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం గెడ్డను వెడల్పు చేయాలంటూ ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వెంటనే గెడ్డలో జెసిబితో ఇళ్ల పునాదుల నుంచి మెట్ల వరకు లోతుగా తవ్వేశారని చెప్పారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి గెడ్డలో నీటిప్రవాహం ఎక్కువై, ఇళ్లన్నీ కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏళ్ల తరబడి ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారని, వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. గెడ్డతో ఇళ్లకు ప్రమాదం జరగకుండా సైడ్ వాల్ నిర్మించాలన్నారు. మరోవైపు పట్టణంలో పుణ్యగిరి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సుకు వచ్చే గెడ్డను 46 మంది ఆక్రమించారని, ఇందులో విద్యాసంస్థలు కూడా ఏర్పాటుచేసి వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. వీటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో అచ్చియ్యమ్మ, పద్మ, డి.లక్ష్మి, డి.కొండమ్మ, రౌతు సూరమ్మ, ఎన్.నారాయణమూర్తి. సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-వేపాడ

ఈ నెల ఐదో తేది నుంచి మండలంలో ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ప్రతీ గ్రామ సచివాలయంలోనూ ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామని, ఆధార్ కార్డు లేనివారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డులో మార్పులకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నెల 5, 6న వీలుపర్తి, బానాది, కెజిపూడి, 7, 8న జాకేరు, ఎన్‌కెఆర్‌పురం, బొద్దాం, ఆర్‌ఎస్‌పేట, 12, 13న డిఆర్‌పేట, వావిలపాడు, పాటూరు, 14న ఆతవ, బల్లంకి, 15న వేపాడ, నల్లబిల్లి, 14, 15న సింగరాయి సచివాలయాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కె.అప్పలరాజు 24 వ డివిజన్‌లో పర్యటించారు. కొత్త అగ్రహారం ప్రాంతాలలో సిబ్బందితో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా వీధి దీపాలు, కాలువల సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అక్కడక్కడ చెత్తాచెదరాలు నిల్వ ఉండడానికి గమనించి వెంటనే వాటిని ప్రక్షాళన చేయాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఎఒ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు


జడ్జి కనకలక్ష్మిని సత్కరిస్తున్న న్యాయవాదులు

బాధ్యతలు స్వీకరించిన జడ్జి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జిగా బి.కనకలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గజపతినగరం కోర్టు నుంచి ఎస్.కోట కోర్టుకు బదిలీపై వచ్చారు. అనంతరం న్యాయమూర్తి బి.కనకలక్ష్మి.. బార్ అసోసియేషన్‌ను సందర్శించి, న్యాయవాదులతో సమావేశమయ్యారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బివిఎస్ రామారావు ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ త్వరితగతిన కేసులను పరిష్కరించడంలో న్యాయవాదులంతా సహకారాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, ఎజిపి అల్లు సత్యాజీ, గేదెల ప్రకాశ్, ఎన్‌టివి దాసు, బి.త్రిమూర్తులు, ఎం.దొరబాబు, వారాది ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ముకుందపురం, తిమిడి గ్రామాల మధ్య గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి పడుతున్న బాధలు తొలగిపోతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, ముకుందపురం, ఓబులయ్య పాలెం మాజీ సర్పంచులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పాఠశాల విద్యలో ప్రభుత్వం అసంబద్ధ విధానాలు అమలు చేస్తోందని, వీటికి వ్యతిరేకంగా చేపడుతున్న ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జె.సి రాజు కోరారు. శుక్రవారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మరింత గందరగోళ పరిస్థితులు కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వం 6 రకాల పాఠశాలలను నెలకొల్పితే, ఈ సర్కారు 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయటానికి చూస్తుందన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను మాత్రమే ఉన్నత పాఠశాలల్లో కలిపితే, కూటమి ప్రభుత్వ 1, 2 తరగతులను కూడా వదల్లేదని చెప్పారు. ఒక్కొక్క పాఠశాల ఒక్కొక్క తీరున విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించటంతో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. వీటిని సరిచేయాలని ఈ నెల 5న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన లు చేపడుతున్నట్లు చెప్పారు. 9న జిల్లా కేంద్రం ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


దాబాలో మద్యం తాగుతున్న వ్యక్తులను పట్టుకున్న ఎస్ఐ

దాబాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దాబాలు, హోటళ్లలో బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.గణేష్ హెచ్చరించారు. గురువారం రాత్రి సతివాడ పరిసర ప్రాంతాల్లో దాబాలపై పోలీసులు దాడులు చేపట్టారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. దాబాలు, హోటళ్లలో మద్యం సేవించడానికి అనుమతిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

ఆశ్రమానికి వితరణ

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమానికి ఎస్‌బిఐ పార్వతీపురం బ్రాంచి పూర్వ సిబ్బంది, విశాఖపట్నానికి చెందిన ఎన్.మధుసూదనరావు, తదితరులు సుమారు రూ.50 వేల విలువైన వాటర్ కూలర్‌ను శుక్రవారం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వికలాంగులకు సంస్థ చేస్తున్న సేవలను మధుసూదనరావు కొనియాడారు. అనంతరం ఆశ్రమంలో ఉంటున్న 50 మంది పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శశికుమారి, పతివాడ అప్పన్న, రెడ్డి రాంప్రసాద్, లక్ష్మి అరుణ, సంస్థ వ్యవస్థాపకులు భోజంకి సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి-తెర్లాం

స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శుక్రవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు నవధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు 18 రకాల విత్తనాలను సారవంతమైన నేలలో చల్లాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చల్లితే పురుగుల మందులు వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.సునీల్ కుమార్, వెలుగు ఎపిఎం టి.రాము, ఎన్ఎఫ్ఇ రమేష్, ఎఇఒలు వెంకటేష్, కృష్ణ, ఎంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఎం ఆనందరావు

ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యం

ఆర్‌జెడి చిన్మయిదేవి


కొత్తవలస... మాట్లాడుతున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-కొత్తవలస

కిశోర బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యంగా కిశోర వికాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి తెలిపారు. గురువారం మండలంలోని ముసిరాం గ్రామంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ ఆర్.ఉమాదేవి అధ్యక్షుతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక అంశాలపై అవగాహనతోపాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ లక్ష్మీబాయి, సెక్టార్ సూపర్వైజర్లు కె.రమణమ్మ, కె.వి.స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ అరుణకుమారి అన్నారు. పట్టణంలోని 16, 18 వార్డులలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కిశోర బాలికలు రుతు పరిశుభ్రత పాటించాలన్నారు. లైంగిక వేధింపులకు గురైతే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కామేశ్వరి పాల్గొన్నారు.

గంట్యాడ : కిశోర బాలికల శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి కోరారు. శుక్రవారం నరవ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. బాలికలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

వేపాడ : వేపాడ మండల కేంద్రంలో విక్టరీ పాఠశాలలో కిశోర వికాసంపై సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమం అమలుపై ఐసిడిఎస్ సిబ్బంది సూచనలు చేశారు. విక్టరీ పాఠశాల డైరెక్టర్ రాఘవ్, మహిళా కానిస్టేబుల్ ధనలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు. అంగన్వాడీల కేంద్రాల్లో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి వార్డు సందర్శన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో శనివారం నుంచి వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వార్డు సమస్యల పరిష్కారం కోసం 20 వార్డుల్లోనూ పర్యటించనున్నట్లు తెలిపారు. ఆయా వార్డుల్లో వీధి లైట్లు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐ, వార్డు కార్యదర్శి, ప్లానింగ్ సూపర్‌వైజర్, శానిటేషన్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

150 గజాల వరకు ఉచిత రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా 150 చదరపు గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తహశీల్దార్ బి.సుదర్శనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 151 నుంచి 300 గజాల వరకు రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని వెల్లడించారు.

మురుగునీటిలో తాగునీటి పైప్‌లైన్ లీక్


మురుగునీటి కాలువలో లీకవుతున్న పైప్‌లైన్

ప్రజాశక్తి - సంతకవిటి

సంతకవిటిలో తాగునీరు సరఫరా చేసే పైపులైన్ మురుగునీటి కాలువ వద్ద లీకవుతోంది. కలుషితనీరు ప్రజలకు సరఫరా కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జావాం నుండి సంతకవిటికి తాగునీరు సరఫరా అవుతుంది. శుక్రవారం మురుగునీటి కాలువలోని ఉన్న తాగునీరు పైప్‌లైను లీక్ అవడంతో మరమ్మతులు చేశారు. కానీ ఇదే పైప్‌లైన్ నుంచి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి రోగులతోపాటు పలు వార్డులకు తాగునీరు సరఫరా అవుతుంది. తాగునీరు విషతుల్యంగా మారుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలోని మండలంలోని డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఎం.ఆర్ అగ్రహారం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో విష జ్వరాల బారిన పడి కొంత మంది మృతిచెందారు. నేటికీ ఆ గ్రామాల్లో మురుగునీరు దోమలకు నిలయాలుగా మారినా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. సంతకవిటిలో మురుగునీటిలో తాగునీరు లీకవడం, అదే నీరు సరఫరా కావడంతో ప్రజలు భయాందోళన చెందితున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటిలో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ను తొలిగించి, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్యలకు చెక్

ప్రజాశక్తి-రేగిడి


కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పట్టాభి

సంకిలి గ్రామంలో దళిత కాలనీ, గొల్లవీధిలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి ఆధ్వర్యంలో తాగునీటి సమస్యలకు చెక్ పెట్టారు. పంచాయతీ నిధులతో 255 మీటర్ల తాగునీటి పైప్‌లైన్, 63 కుళాయిలు వేసి, శుక్రవారం ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పట్టాభి మాట్లాడుతూ నాలుగేళ్లుగా సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకుని మండలానికి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కర్రి రమణ, గంగు కృష్ణ, సంకిలి, అప్పారావు పంచాయతీ కార్యదర్శులు కూర్మారావు, రామ్‌కుమార్, విఆర్ఒ దుర్గారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఐదు మండలాల నుంచి పలు సమస్యలపై 10 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లి నాయుడు, ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, మాజీ ఎంపిటిసి దుల్ల వెంకట్రావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా ఉత్తీర్ణత కావాలి

ప్రజాశక్తి-రేగిడి

పదో తరగతిలో ఇటీవల ఫెయిలైన విద్యార్థులు ఈసారి కచ్చితంగా ఉత్తీర్ణత కావాలని డిప్యూటీ డిఇఒ కెవి రమణ తెలిపారు. మండలంలోని అంబాడ వెంకటాపురం, రేగిడి హైస్కూల్లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తప్పనిసరిగా పాస్ అయ్యేటట్టు తగిన శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. ఎవరైనా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ రెండు సెంటర్లను వినియోగించుకోవచ్చని ఎంఇఒ ఎం.వరప్రసాద రావు తెలిపారు.

రేగిడిలో విద్యార్థి మిత్ర కిట్లు భద్రపరిచే రూములను పరిశీలించి, ఏర్పాట్ల పట్ల డిప్యూటీ డిఇఒ సంతృప్తి వ్యక్తం చేశారు. మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో రేగిడి హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు హరిబాబు, కెంబూరు కూర్మినాయుడు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ పొన్నాడ అప్పలనాయుడు, ఐఇఆర్‌పిటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రెడ్స్ ఎన్‌జిఒ సిఇఒ రామకృష్ణంరాజు

ఎఫ్‌పిఒలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఒలు) బలోపేతం కావాలని బ్రెడ్స్ ఎన్‌జిఒ సిఇఒ రామకృష్ణంరాజు కోరారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పది మండలాల ఎఫ్‌పిఒలు, అకౌంటెంట్లకు క్లస్టర్ ఆధారిత వ్యాపార సంస్థ (సిబిబిఒ)పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించే పంటలను మార్కెటింగ్ చేసుకొని రెట్టింపు ఆదాయం పొందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. డిసిసిబి జనరల్ మేనేజర్ కెవివిఆర్ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి రుణ సదుపాయం కావాలన్నా అందించడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌పిఒలకు ఎదురైన ఇబ్బందులకు పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కోదండపాణి, డిసిసిబి చీఫ్ మేనేజర్ యు.స్వాతి, మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జున్, చార్టెడ్ అకౌంటెంట్ ఎస్.సూర్య, ట్రైనర్ ప్రభాకర్, కో-ఆర్డినేటర్ జి.ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

7న వాసవీమాత జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 7న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా రెండు రోజులుపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం దేవస్థానం కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దేవాలయం అభివద్ధిలో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. దేశంలో మొట్ట మొదటిసారిగా వాసవి మాత జీవిత చరిత్రకు సంబంధించి 25 ఘట్టాలు హైదరాబాద్‌కు చెందిన శిల్పులతో ఆకర్షనీయంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ ఘట్టాలను మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరిస్తారని తెలిపారు. విశిష్ట అతిథిగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు హాజరువుతున్నట్లు తెలిపారు. దేవాలయం గౌరవాధ్యక్షులు కోలగట్ల వీరభద్రస్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వాసవీ మాత జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చే రుణాలకు షరతులు కుదించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా ఇచ్చే రుణాలకు షరతులు తగ్గించాలని నాయీ బ్రహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టివి దుర్గారావు కోరారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలు సివిల్ స్కోర్ పేరుతో బ్యాంకులు నిరాకరిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ ద్వారా అందిస్తానన్న రుణాలు అందరికీ అందడం లేదని,ట్రైనింగ్ పొందిన వారికి ఇస్తానన్న లక్ష నుండి మూడు లక్షల వరకు రుణాలు కూడా అందడం లేదని తెలిపారు. ముద్ర రుణాలకు ష్యూరిటీ లేకపోయినా బ్యాంకు వారు పొదుపు గ్రూపుల వారికే ఇస్తానని చెప్పి ప్రభుత్వ లక్ష్యాన్ని గండి కొడుతున్నారు అన్నారు. ప్రభుత్వ రుణాలన్నీ అన్నిటికీ షరతులు తగ్గించి అర్హులైన అందరికీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో సత్యనారాయణ, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల


వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

మండలంలోని కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిఎంహెచ్ఒ ఎస్.జీవన రాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఐఎల్ఆర్, టెంపరేచర్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సిబ్బందికి వ్యాక్సిన్ నిర్వహణపై తగు ఆదేశాలు ఇచ్చారు. ఇహెచ్ఆర్ ప్రోగ్రాంపై మాట్లాడి నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. మందుల నిల్వ గదిని పరిశీలించి యువిన్ పోర్టల్, ఇహెచ్ఆర్, టెంపరేచర్ రిజిస్టర్, ఇ-ఔషధి యాప్‌లపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సిసి రాజు, వైద్యాధికారులు వై.ధనంజయ్, పి.వి.శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

బాబోయ్.. బొబ్బిలి రైల్వే స్టేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నూతన రైల్వేస్టేషన్ ముందు భాగం అస్తవ్యస్తంగా ఉంది. మోడల్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి గోతులమయంగా ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా, గోతులను పూడ్చి నూతన రహదారి ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో కల్వర్టు



రోడ్డుపై ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కృష్ణరాయుడి పేట సమీపంలో రైవాడ ప్రాజెక్టు కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. రోడ్డు మధ్య భాగం వరకు కిందికి ఒరిగిపోయి, కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఆర్‌అండ్‌బి అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.

IN THE HONOURABLE COURT OF THE IIIrd ADDITIONAL JUNIOR CIVIL JUDGE (PROHIBITION &EXCISE COURT) AT SRIKAKULAM.
O.S.No. 430/2023

Between:-
Polumuru Prasadarao ....Plaintiff
And:-
Dasari Lakshmikantam and others .....Defendants

To,
D-1: Dasari Lakshmikantam, W/o late Asapu Mallibabu, aged 63 years, Hindu, household duties, residing at Kancharam village, Aguru Kancharam, Rajam Mandal, Srikakulam District.

NOTICE

It is to inform you that the above matter stands posted to on 06-05-2025 for your appearance .Hence you have to appear before the Honourable court on **06-05-2025 at about 10.30 AM**. as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.

// By order of the Honourable court//

P. RAMESH KUMAR
ADVOCATE,
SRIKAKULAM.

అక్రమ నిర్మాణాలను గుర్తించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో చేపడుతున్న నిర్మాణాలపై పర్యవేక్షణ చేసి, అనధికార నిర్మాణాలు ఉంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైల్వే ఫ్లైఓవర్, ప్రధాన రహదారిలో ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేస్తే జరిమానా విధించాలని సూచించారు.

డిసిసి ఉపాధ్యక్షులుగా బంగారునాయుడు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా మండలంలోని అంబాదాసు పాలెం గ్రామానికి చెందిన గడి బంగారు నాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ ఆయనకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బంగారునాయుడు మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు సేవ చేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని తెలిపారు.

గురజాడ గ్రంథాలయానికి డిఎస్‌సి మెటీరియల్ వితరణ

విజయనగరం టౌన్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ పుట్టినరోజు సందర్భంగా తన మిత్రుల సహకారంతో 10 వేల రూపాయలు విలువ గల డిఎస్‌సి మెటీరియల్ (పుస్తకాలు)ను గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేసారు. శుక్రవారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మికి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్ ను అందజేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు నాలుగెస్సుల రాజు, అధ్యక్షులు కె.ఎర్నా యుడు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు బి.రామభద్రరాజు, ఎ. భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE VIZIANAGARAM
G.W.O.P. 04 / 2025

Between:
Vepa Kumar S/o late Selvaraj, aged 37 years, Hindu, employee, a permanent resident of Indaramma Colony, Khammam Rural, Khammam District, Telangana State, present working as Railway Police station, Secunderabad, residing at Water tank line, Seethaphal Mandi, Secundrabad. .... Petitioner
And:
Smt. Boina Simhachalam, W/o Late Krishna Murthy, aged about 51 years, House hold duties, residing at Door No;7-85, Golla Veedhi,SambaraVillage, Makkuva Mandal, Parvathipuram Manyam District, Mobile No: 9908789583. .... Respondent

PUBLIC LEGAL NOTICE

Please take notice that the petitioner filed the above GWOP against the respondent directing the respondent to handover the custody of his minor daughter by name Vepa Lithiksha Kumar to the petitioner and the above matter is stands posted to **09-05-2025** for appearance of the respondent here above and if anybody are having any objection / objections they are hereby directed to appear in person or through counsel on the above Honorable Dist Judge Court Vizianagaram on the above said date at **10-30 AM** failing which the matter will be decided in your absence on merits and by order of the Honourable Court.

A. HARISH,
R. RAMAKRISHNA,
Advocates
Opposite Old Dist Court
Vizianagaram
Ph. 9490682844.